# స్కూటర్ - ప్రేమ

జయశంకర్ స్కూటర్ నడిపించేది ఇతర ద్విచక్రసారథుల మాదిరే కాదు. అతను 'ఎయిర్ ఫోర్స్'లో భర్తీ కావల్సిన యువకుడు అని చాలా అభిమానంతో ఆ ఏకైక సంతతి యొక్క బ్రహ్మ బ్రాహ్మీలు, అతని స్పీడు గురించి చెబుతూ వుంటారు. దానితోపాటు, తను ప్రియ పుత్రుడికి ఎలాంటి అపాయము జరగకూడదని ముక్కోటి దేవతలను ప్రతిరోజూ ప్రార్థిస్తూ వుంటారు. మానవ ప్రయత్నం వల్ల, కొన్ని సంవత్సరాల వఱకు, సంతాన భాగ్యం కలుగక పోయినా, పందొమ్మిది మ్రొక్కుల ఫలితంగా తనకు లభించిన ఆ ఒకే ఒక భాగ్య సంతానానికి వాళ్లు అన్ని రకాల వాత్సల్యాలు కురిపించి పెద్దవాణ్ణి చేశారు. అందుకే ఆ ముద్దుల కొడుకు ఏది కోరినా దాన్ని అంగీకరించేవారు. అయినా కూడా మన జయశంకర్ ఏమైన ఒక చెడ్డవాడిగా తయారైనాడా? చదువులో ఉత్సాహం చూపించకుండా వున్నాడా? అనవసరంగా డబ్బు ఖర్చు పెడతాడా? అమ్మాయిల వెనక నీడలా వెంటపడతాడా? సిగరెట్, బీడీలు లాంటివి కాలుస్తాడా? మద్యపానం చేస్తాడా? ఇలాంటి ప్రశ్నలకంతా జయశంకర్ విషయంలో నిషేదార్థక సమాధానాలే దొరుకుతాయి. చదువులో కానియండి, ఆటల్లో కానియండి లేదా లలిత కళల్లో కానియండి అతను అగ్రగణ్యుడే. అందుకే అతని తల్లితండ్రులకు ఆ అబ్బాయిని మందలించే అవసరమే కలుగలేదు. అలా కాకుండా, అతను ఏది చెప్పినా వాళ్లు వినేవాళ్లు. కాలేజీలో చదువుకొనే రోజుల్లో అతను ఒక మోపెడ్ కావాలని కోరితే వాళ్లు అది కొనిచ్చారు. ఇంజనీరింగ్ పాస్ అయిన కొద్ది రోజుల్లోనే, జయశంకర్ ఒక ఉద్యోగం సంపాదించ గలిగాడు.

మొదటి జీతం తీసుకోగానే దాన్ని తండ్రి చేతికి అందించాడు. ఆ తండ్రి ఆనంద భాష్పాలతో దాన్ని తిరిగి ఇచ్చి ''నాయనా, దీన్ని నీ అకౌంటులో బ్యాంకులో వేసెయ్, నువ్వెప్పుడు కూడా అనవసరంగా ఖర్చు చేయవని మాకు నమ్మకముంది'' అని చెప్పేటప్పుడు తల్లి మొహంలో కూడా ఎండా వానా కలయిక ఒకేసారి ప్రత్యక్షమయింది.

జయశంకర్ ఉద్యోగం చేస్తున్న ఆ కంపెనీలో అందరికీ అతనంటే చాలా ఇష్టం. అతను ఎప్పుడూ చిరునవ్వుతో అందరితో మాట్లాడుతూ వుంటాడు.

ఇంజనియర్‌గా ఉద్యగంలో చేరిన తర్వాత జయశంకర్‌కు ఒక చిన్న కోరిక... మోపెడ్ కు బదులుగా ఒక స్కూటర్ కొనాలని. దాన్ని కొనివ్వడానికి తల్లిదండ్రులకు ఇష్టంగానే వుంది. కాని క్రొత్త బండి రాగానే అతని జబ్బు ఇంకా ఎక్కువయింది. మెపెడ్ లోనే వేగముతో వెళ్లే శంకర్‌కు, ఒక ''హమారా బజాజ్'' దొరికితే, ఏం జరుగుతుందో ఇంక ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

స్పీడు ఎక్కువయినా అతనెప్పుడూ ''రాష్''గా డ్రైవ్ చెయ్యడు. స్కూటర్ నడిపేటప్పుడు ఏకాగ్ర చిత్తంతో, అనవసరంగా అటూ ఇటూ చూడకుండా చాలా శ్రద్ధతోనే ఆ సర్కస్ అతను నిర్వహించేవాడు. రోడ్డులో, ఈకాలంలో ఎక్కువగా విహారం చేస్తున్నా లేత, ముదురు రకాల సీతాకోక చిలుకలపై అతని దృష్టి ఎప్పుడూ వెళ్లేది కాదు. కాని,...

ఈ మధ్యన తన స్కూటర్ లాగే ఇంకొక స్కూటర్, అతని కళ్లను ఆకర్షించడం ప్రారంభమయింది. రోడ్డుపై ఎన్నో బజాజ్ స్కూటర్లు తిరుగొచ్చు. కాని, ఈ బజాజ్‌కు ఏదో ఒక ప్రత్యేకత. తన బజాజ్‌కున్న రంగే దానికి కూడా. రిజిస్ట్రేషన్ నెంబర్లకు కూడా, ఏదో సామీప్యమున్నట్లు వుంది. కానీ, అతని మనసుని హఠాత్తుగా ఆకర్షించింది ఇదేమీ కాదు.

ఆ స్కూటర్ సారథి అందమైన, చురుకైన ఒక తరుణీమణి. ఎప్పుడు చూసినా, ఆమె షల్వార్ కమీజ్ సెలక్షన్‌ని మెచ్చుకోకుండా వుండడం అతనికి అసాధ్యంగా వుండేది. కాని బట్టలకు అతని కళ్ల భాష అర్థం కాదుగదా! ఆ యువతితో అతనికి మాట్లాడాలని అతనికి వుంది. కాని, ఎలా? ఆమె స్కూటర్‌ను ఆపడం సాధ్యం కాదు గదా!

ఆమె స్కూటర్ చూడగానే అతని స్కూటర్ స్పీడు తగ్గిపోతుంది. మామూలుగా ఈ 'ఎన్‌కౌంటర్' జరిగేది, రాణీగంజ్ తర్వాత వచ్చే జంక్షన్‌కు - బోట్ క్లబ్‌కు మధ్యన వెస్ట్ మారేడ్ పల్లి నుంచి వచ్చే జయశంకర్ ప్యారడైజ్ జంక్షన్ దాటి ట్యాంక్‌బండ్ కు ముందువచ్చే జంక్షన్ చేరేటప్పుడు మామూలుగా ఆ సుందరి ఒక మోస్తరు స్పీడులో రాష్ట్రపతి రోడ్డునుంచి వచ్చి, మొత్తం ట్యాంక్ బండు రోడ్డులో అతనికి పైలట్‌గా వర్తిస్తుంది. చాలా స్పీడుగా వెళ్లే జయశంకర్ స్కూటర్ యొక్క చురుకుదనం, ఆ అమ్మాయి స్కూటర్ చూడగానే తగ్గిపోతుంది. ముందు ముందు, ఆమె వెనక భాగం కొంచెం ఆశ్వాదించిన తర్వాత ఓవర్‌టేక్ చేసి, ఆమె ముఖం చూసి ముందుకెళ్లేవాడు. కొన్నిసార్లు ఆమె స్కూటర్ ముందు వుండేటప్పుడు, జయశంకర్ స్కూటరకు స్పీడే రావటం లేదు.

ఆఫీసులో కూర్చున్నప్పుడు, ఇంట్లో నిద్రపోబోతున్నప్పుడు, ఆమె స్కూటర్, ఆమె వెనక భాగం మరియు ఆమె సుందర వదనం అతని మనసనే 70MM స్క్రీన్ మీద అప్పుడప్పుడూ అలా వచ్చిపోతుండేవి. ఏ అమ్మాయివైపు కన్నెత్తయినా చూడని తనను, ఈ అమ్మాయి ఎలా ఆకర్షించ గలుతుంది అని అతను చాలాసార్లు ఆలోచించాడు. ఇదంతా తన వయస్సు ప్రభావమేనా? తనలో ప్రేమ భావం చిగురించడం మొదలయిందా అన్న అనుమానం కలిగింది. ఆమెతో కనీసం ఒక్కసారి మాట్లాడే అవకాశం కలిగితే ఎంత బావుణ్ణు! ఆమె పేరేమిటో, కులమేమిటో? చూపులకు మాత్రం

హిందూ స్త్రీలాగా కనిపిస్తుంది. వివాహం అయినట్టు లేదు. ఎప్పుడైనా ఆమె మాట్లాడే అవకాశం దొరికినప్పుడు, ఆమె ''ఛీ పో'' అని తిరస్కరిస్తే తన తొలి ప్రేమ ఈవిధంగా సమాప్తమై పోతుందేమో అనికూడా కలవరం చెందాడు. తనలో వృద్ధి చెందుతున్న ఈ ప్రేమ భావనకు ట్యాంకు బండు రోడ్డు ప్రతిరోజూ ఎరువులా దోహదం చేస్తుంది... ఆమె ఇల్లెక్కడో? ఎక్కడ పనిచేస్తున్నదో తెలుసుకోవాలన్న ఉత్సుకత జయశంకర్‌లో పెరగసాగింది.

ఆరోజు సోమవారం. జయశంకర్ ట్యాంక్ బండు సమీపంలోకి వచ్చాడు. తనకు కొంచెం ముందుగా, ఆమె స్కూటర్‌పై వెళుతుంది. మంచి ఆకుపచ్చ సెల్వారు, లేతాకు పచ్చరంగు జరీ బుటాలు కల కమీజు, అదే రంగులో సాదాగా వున్న చున్ని, ఆమె అందానికి మరింత శోభను కలిగిస్తున్నాయి. జడ అల్లకుండా వదిలేసిన దీర్ఘమైన ఆమె నల్లని కురులు, కుడి భుజంపై నుండి స్వేచ్ఛగా ఎగురుతున్న చున్నీతో పోటీ పడుతున్నాయి. విసురుగా వీచే గాలి తాకిడికి, ఆమెకురులు మరింత పైకి ఎగిరే సందర్భంలో మనోహరమైన ఆమె మెడతోపాటు, అర్ధచంద్రాకృతిలో కనిపిస్తున్న, వీపు పైభాగము జయశంకర్‌ని పరవశింప జేస్తున్నాయి. ఆ దృశ్యాన్ని మరింత సమీపం నుండి చూడాలన్న తహతహతో అతను తన స్కూటర్‌ను ఆమెకు దగ్గరగా పోనిస్తున్నాడు.

ఆకస్మికంగా ఇది జరిగింది... ఒక విపరీతమైన గాలి తాకిడికి, కుడివైపు భుజంమీది నుండి అధికంగా ఎగురుతున్న చున్ని సాంతం ఒక పెట్టున గాల్లోకి ఎగిరిపోయింది. ఆ క్షణంలో అసంకల్పితంగా ఆమె సడన్ బ్రేక్ వేసింది. గాల్లో ఎగురుతోన్న ఆమె చున్ని, అదే సమయంలో వెనక వున్న జయశంకర్ ముఖాన్ని కప్పేసింది. దానితో ముందు రోడ్డు సరిగా కనిపించక పోవటంతో జయశంకర్ గూడా బ్రేకు వేశాడు కాని, అంతలోపలే వారిద్దరి స్కూటర్లు ఒక దాన్నొకటి రాసుకొని క్రింద పడిపో యాయి. తన ముఖాన్ని ఆవరించివున్న, ఆ మనోహరమైన మునుగులో క్రింద బడ్డా, పలుచగా వున్న ఆ మునుగులోంచి అతనికి ముందున్నవన్ని చక్కగానే కనిపిస్తు న్నాయి. ముఖం నుండి, నాభివఱకు ఆశ్లేషించి వున్న ఆ చున్ని మధుర స్పర్శ సుఖంతో, జయశంకర్‌కు లేవాలని అనిపించలేదు. అతని రెండు కాళ్ల మధ్యన స్కూటర్ పడివుంది. ఆమె చటుక్కున లేచి తన స్కూటర్‌ను రోడ్డుకు పక్కగా పెట్టి, జయశంకర్ వైపు వడివడిగా వచ్చింది. అప్పటికే జనం వారి చుట్టూ మూగారు. భయంతో వణుకుతున్న ఆ అమ్మాయి ఒక్క ఉదుటున జయశంకర్ ముఖంపై నుండి, తన చున్నీని లాక్కుని, అది వుండాల్సిన స్థానంలోనే ప్రతిష్టించుకుంది. చలన రహితుడై పడివున్న అతని ప్రక్కన కూర్చుని, అతని తలను తన ఒడిలోకి తీసుకొంది. అతని చెంపలపై మెల్లగా తట్టి లేపటానికి ప్రయత్నించింది. అప్పటికీ అతనిలో కదలిక లేకపోవటంతో, ఊపిరి ఆడుతున్నదా లేదా అన్న అనుమానంతో అతని ముక్కుక్రింద

వేలు పెట్టి పరీక్షించింది. చుట్టూ జేరిన జనంలో కలకలం. ఇం కొంచెం సేపట్లో పోలీసులు కూడా వచ్చేస్తారేమో నన్న భయంతో ఆమెలో వణుకు అధికమైంది. ''దేవుడా... ఈ వ్యక్తికి ఏమైందో అన్న బాధతో, సహాయం కోసం చుట్టూ ఉన్న జనంవేపు చూసింది. వాళ్లల్లో ఒక వ్యక్తి అతని చేతిలోని వాటర్ బాటిల్‌ను ఆమె కందించాడు. దాన్లోంచి కొద్దిగా నీటిని చేతిలోకి తీసికొని అతని ముఖంపై చిలకరించింది. ఇక అతను క్షణంకూడా ఆలస్యం చేయకుండా అప్పుడే నిద్రనుండి లేచినట్లుగా కళ్ళను రెపరెప లాడిస్తూ భీతితో తల్లడిల్లుతున్న ఆ హరిణాక్షి ముఖాన్ని చూసి ఒక మందహాసాన్ని ఆమెకు కానుకగా ఇచ్చాడు. చుట్టూ చేరిన జనాన్ని చూసి, జయశంకర్ తక్కున లేచి, తన స్కూటర్‌ను గూడా పైకి లేపి ''ఏమైంది? నాకేమైంది?'' అంటూ హిందీలో అడిగాడు. ''ఏం కాలేదు; చిన్న యాక్సిడెంట్ అయింది'' అంటూ ఇద్దరు వ్యక్తులు హిందీలోనే జవాబు చెప్తూ అతన్ని, స్కూటర్ని రోడ్ ప్రక్కన చెట్టు నీడకు తీసుకెళ్ళాడు. మరొకరు ఆ సుందరీమణి స్కూటర్‌ను కూడా ఆ చెట్టుక్రిందకే చేర్చారు. ''టీ కావాలా, నీళ్ళు కావాలా'' అంటూ కొందరు ఆత్రంగా అడగగా జయశంకర్ చిర్నవ్వు ప్రదర్శిస్తూ ''నాకేం కాలేదు'' అంటూ సమాధానమిచ్చాడు. జయశంకర్ కొద్దిగా కుంటటం చూసి ''ఫ్రాక్చరయ్యిందేమో, త్వరగా హాస్పిటల్‌కు వెళ్ళాలి'' అంటూ జనంలోని ఒక వ్యక్తి తన కాళ్ళను జాడిస్తూ ఆమె వైపు చూసి నవ్వసాగాడు. ఆమె ముఖంలోని కలవరపాటు కొంత తగ్గినా పొంతం తగ్గిపోలేదు.

ఇద్దరూ తమ స్కూటర్లను చెక్ చేసుకొని స్టార్ట్ చేశారు. రెండు స్కూటర్లకు ఎలాంటి నష్టం కలగలేదు. అప్పుడు కొంచెం సంకోచంతో ''సర్, నేను పనిచేసే ఆఫీసు, ఇక్కడే, బషీర్‌బాగ్‌లోనే వుంది. కొంచెం అక్కడ వరకు వస్తే, మా ఆఫీసు చూడవచ్చు - మనం కొంచెం సేపు మాట్లాడుకోవచ్చు'' అని గుండెదడ పూర్తిగా పోలేనట్లు చెప్పింది. ''ఓహ్ - ష్యూర్ - దానికేం అట్లాగే, తప్పకుండా వస్తాను. కమాన్, లెట్ అజ్ గో'' అని అతను సంతోషంగా అంగీకరించాడు.

వారుభయలూ వెళ్ళి కూర్చుని మాట్లాడడం ప్రారంభించారు. ఆ అమ్మాయి పేరు జయశ్రీ అని తెలియగానే అతని శరీరంపై పుష్పవృష్టి కురిసినట్లు అతనికి సంతోషానుభూతి కలిగింది. ఆమె ఒక బ్రాహ్మణుల అమ్మాయి అని, పక్కా వెజిటేరియన్ అనికూడా తెలియగానే, అతని సంతోషం స్వర్గసీమకు చేరింది. ఆమె కూడా తనలాగే ఒక ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ అని, ఒక ప్రైవేట్ కంపెనీలో పని చేస్తుందనీ తెలిసి ''మనిద్దరం ఒకేరకం మనుషులమని, మన స్కూటర్లు కూడా తెలసుకున్నాయేమో'' అని చెప్పకుండా వుండేందుకు వీల్లేక పోయిందతనికి.

''స్కూటర్ల మధ్యన ప్రేమ చిగురించిందేమో అందుకే ఒక దాన్నొకటి కలుసుకోవాలని అవి నిర్ణయించుకున్నాయి'' అని ఆమె నవ్వుకొని ఒక ఆగ్నేయాస్త్రం

వదిలింది. జయశంకర్ శరీరంలో నాడీవ్యూహం అంతా ఎక్కడో సంకోచిస్తున్నట్టు, వ్యాకోచిస్తున్నట్టు అతనికి అనిపించింది. ఇంకొంచెం సేపు అక్కడ ఆగితే తనవల్ల ఏదైనా సాహసం జరిగి పోతుందేమోనని భయపడి జయశ్రీ తెప్పించిన కాఫీ త్రాగి, త్వరగా అక్కడనుంచి పారిపోయాడు.

మరునటి రోజు మళ్లీ వాళ్లు ట్యాంక్ బండ్ పై కలుసుకున్నారు. అతని ఆహ్వానం మేరకు, ఆమె అతని ఆఫీసుకు వెళ్లడం, ఇద్దరూ కలసి, ఒక హోటల్లో సుఖంగా భోం చేయడం ''అవిఘ్నమస్తు''గా జరిగిపోయింది.

తరువాత జయశంకర్ జయశ్రీ ఇంటికి వెళ్లడం, ఆమె తన తల్లిదండ్రులతో అతని ఇంటికి వెళ్లడం జరగకుండా వుంటుందా?

ఇంక ఈ కథను పొడిగించడం అఖ్ఖర లేదు. దాదాపు అన్ని తమిళ సినిమాల పర్యవసానంలాగా ఈ కథ ముగింపు గూడ మంగళ వాయిద్యాలతో, పుష్పాలంకారాలతో, మంత్రోచ్చారణతో ముగించేద్దామా? మరి భోజనం?? ఇప్పుడు ఉదయం పదిగంటలే కదా! పదకొండున్నరకు మొదలు పెడదాం!

---